క్లుప్తంగా

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి

గంట్యాడ: ఉగాది సందర్భంగా సంస్కార భారతి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన విజయనగరంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కేజీబీవీ విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థినులు టి.హాసిని, ఎల్.లావణ్య, సీహెచ్.యమునశ్రీ, బి.నిఖితకు నిర్వాహకులు విజయనగరంలోని గురజాడ స్వగృహంలో సోమవారం ప్రశంసపత్రాలు అందజేశారు. విద్యార్థినులను కేజీబీవీ ప్రిన్సిపాల్ అల్లుజ్యోతి అభినందించారు.

గుజ్జింగివలసలో వైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యసిబ్బంది

గుర్ల: విజయనగరానికి చెందిన శ్రీసాయిసూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో మండలంలోని గుజ్జింగివలసలో వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి అప్పలనర్సయ్య, అట్టాడ అప్పలరాజు సోమవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయించారు. ఈశిబిరంలో అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. 150 మందికి తనిఖీలు చేయగా, 30 మందికి వివిధ శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించామని వైద్యాధికారి శ్రీరామమూర్తి తెలిపారు.

భూసమస్యల పరిష్కారానికే రీసర్వే




సర్వే పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేష్

చీపురుపల్లిరూరల్: ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రైతుల భూసమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా సమగ్ర భూరీసర్వే చేయిస్తోందని తహసీల్దార్ ఎం.సురేష్ తెలిపారు. మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో చేపడుతున్న గ్రౌండ్ ట్రూతింగ్ సర్వే పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్ర భూరీసర్వేను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్వే చేసే సమయంలో రైతులంతా పొలాల వద్ద ఉండి సిబ్బందికి సహకరించాలని కోరారు.

24న వాహనాల వేలం

శృంగవరపుకోట: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈనెల 24న బహిరంగ వేలం వేయనున్నట్టు ఎస్ఈబీ ఎస్‌హెచ్‌ఓ ధర్మారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్టేషన్ ఆవరణలో 24వ తేదీ ఉదయం 11 గంటలకు 6 ద్విచక్ర వాహనాలు, 1 ఆటోను వేలం వేయనున్నామని, ఆసక్తి గలవారు వేలం పాటకు హాజరు కావాలని కోరారు.

యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా అప్పలనాయుడు



చీపురుపల్లి: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) రాష్ట్ర కౌన్సిలర్‌గా మండలంలోని ఇటకర్లపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు మీసాల అప్పలనాయుడు అయిదోసారి ఎన్నికయ్యారు. విజయనగరంలో సోమవారం జరిగిన 48వ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈయన మండలంలోని పేరిపి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు గతంలో ఆరుసార్లు చీపురుపల్లి మండలశాఖ అధ్యక్షుడిగా ఆరుసార్లు జిల్లా కౌన్సిలర్‌గా బాధ్యతలు నిర్వహించారు. నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల ఉపాధ్యాయులు ఆయనికి అభినందనలు తెలిపారు.

సరుకుల పంపిణీలో నిర్లక్ష్యం వద్దు

మెరకముడిదాం: రేషన్ డిపోల ద్వారా లబ్ధిదారులకు సకాలంలో సరుకుల పంపిణీ చేయాలని, నిర్లక్ష్యం వహించవద్ద ని డీలర్లకు సీఎస్ డీటీ పిన్నింటి రామారావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలానికి చెందిన రేషన్‌డీలర్లతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేస్తున్న అన్ని రకాల సరుకులను లబ్ధిదారులకు తప్పని సరిగా అందజేయాలని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అంతా పని చేయాలని అన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్య సిరులు

- వెలుగు ఆధ్వర్యంలో చిరుధాన్యాల వంటకాల పోటీలు



వేపాడ: చిరుధాన్యాల వంటకాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్ కృష్ణంరాజు, ఎంపీడీఓ పట్నాయక్ తదితరులు



లక్కవరపుకోట: విజేతలకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్ టి.రామకృష్ణ



లక్కవరపుకోట: భూమిరెడ్డిపాలెంలో చిరుధాన్యాల విత్తనాల ఎంపికపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న సబల సంస్థ సభ్యులు

చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, వీటిలో అధిక పోషకాలు ఉంటాయని వివిధ శాఖల అధికారులు అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల మహోత్స వంలో భాగంగా వెలుగు ఆధ్వర్యంలో మహిళలకు చిరుధాన్యాలతో తయారు చేసే ఆహార పదార్థాలు, వంటకాల తయారీపై వెలుగు కార్యాలయాల్లో అధికారులు సోమవారం పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలను, వాటిని ఆహారంగా తీసుకోవాల్సిన ఆవశ్యకతను అధికారులు వివరించారు. అలాగే చిరుధాన్యాల సాగుకు రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పూర్వీకులు వీటిని ఆహారంగా తీసుకుని ఆరోగ్యంగా ఉండేవారని, ప్రస్తుత తరం ఆహారపు అలవాట్లలో మార్పు రావడం వల్ల చాలా మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారని, గతంలో మాదిరిగా మళ్లీ చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. చిరుధాన్యాల వినియోగంపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. వెలుగు, ప్రకృతి వ్యవసాయం ఏపీఎంలు, ఎంపీడీఓలు, తహసీల్దార్‌లు, ఐసీడీఎస్, వివిధ శాఖల అధికారులు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

– వేపాడ,గంట్యాడ,బొండపల్లి,జామి, కొత్తవలస,లక్కవరపుకోట, చీపురుపల్లిరూరల్



జామి: :జామిలో మిల్లెట్స్‌తో తయారు చేసిన వంటకాలను పరిశీలిస్తున్న అధికారుల బృందం



గంట్యాడ: చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ భవాని, సీడీపీఓ ఉమాభారతి



బొండపల్లి: వంటకాలను ప్రదర్శిస్తున్న మహిళలు



చీపురుపల్లిరూరల్: గరివిడిలో వంటకాల ప్రదర్శనను పరిశీలిస్తున్న అధికారులు



కొత్తవలస: కొత్తవలసలో చిరుధాన్యాల వంటకాలను రుచి చూస్తున్న ఎంపీడీఓ పద్మజ

నోటి ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



చీపురుపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది



గజపతినగరం: ర్యాలీలో పాల్గొన్న ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

చీపురుపల్లి: నోటిశుభ్రత పాటిస్తే చాలా వరకు రోగాల బారినుంచి తప్పించుకోవచ్చని, ప్రతి ఒక్కరూ నోటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) డెంటల్ అసిస్టెంట్ సర్జన్ రవిశేఖర్ అన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందితో కలిసి సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ వారం రోజులుగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు నోటి శుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ తరచూ దంత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నోటి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించామని తెలిపారు.

సకాలంలో పరీక్షలు చేయించుకోవాలి

గజపతినగరం: దంతాలు, నోటి సంబంధిత ఆరోగ్య సమస్యలు తలెత్తితే సకాలంలో పరీక్షలు చేయించుకోవాలని స్థానిక ఏరియా ఆస్పత్రి డెంటల్ డాక్టర్ మల్లికార్జునరావు సూచించారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గజపతినగరంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ సివిల్ సర్జన్ గౌరి, జనరల్ మెడిసన్ సునీల్, సాహిన్, సౌందర్య, రత్నకుమారి తదితర సిబ్బంది పాల్గొన్నారు

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులాహ్వానం

గంట్యాడ: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఒక అంగన్‌వాడీ కార్యకర్త, 5 హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ట్లు సీడీపీఓ డోకుల ఉమాభారతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న 10 వతరగతి ఉత్తీర్ణులైన స్థానిక వివాహిత మహిళలు ఈపోస్టులకు అర్హులని పేర్కొన్నారు. మల్లిచర్ల అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు(ఓసీ), సారిక గ్రామ అంగన్‌వాడీ కేంద్రం-4 హెల్పర్ పోస్టు (ఓసీ), గుంకలాం కేంద్రం-2 హెల్పర్ (ఓసీ) కిండాం అగ్రహారం కేంద్రం హెల్పర్ (ఓసీ), వేంద్రం కేంద్రం హెల్పర్ (ఓసీ), ఆర్.వసంత గ్రామ అంగన్‌వాడీ హెల్పర్ పోస్టును ఓసీకి కేటాయించారు. ఆసక్తిగలవారు దరఖాస్తులను ఈనెల 29వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఐసీడీఎస్ కార్యాలయానికి అందజేయాలని సూచించారు.

చీపురుపల్లి ఐసీడీఎస్ పరిధిలో..

చీపురుపల్లి: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, మినీ అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు పీఓ కె.వి.ఎన్.ఆర్. రాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గరివిడి మండలంలోని రేగటి అగ్రహారంలో అంగన్‌వాడీ వర్కర్, చీపురుపల్లి మండలంలోని గురానపేట, సిర్లిపేటలో మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే చీపురుపల్లి మండలం లోని ఆర్థివలస, పుర్రేయవలస, అంబేడ్కర్‌కాలనీ, గరివిడి మండలంలోని దేవాడ కేంద్రం-1, కొండలావే రు, కుమరాం కేంద్రం-1, మెరకముడిదాం మండలంలో సాతాంవలస కేంద్రం-2, పులిగుమ్మి, కొండలావేరు, అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. 21 నుంచి 35 ఏళ్లలోపు ఉండి 10వ తరగతి ఉత్తీర్ణులైన ఆయా గ్రామాలకు చెందిన వివాహితులు అర్హులని, ఆసక్తి గల వారు దరఖాస్తులను ఈనెల 29వ తేదీ సాయంత్రం 5గంటలులోగా చీపురుపల్లి ఐసీడీఎస్ కార్యాలయానికి అందజేయాలని సూచించారు.

గుర్ల మండలంలో..

గుర్ల: మండలంలోని గొల్లలపేట, సదానందపురం మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు, సదానందపురం, మణ్యపురిపేట, కలవచర్ల కేంద్రాల్లో అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి నెల్లిమర్ల ఐసీడీఎస్ అధికారులు సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. అర్హులు ఈనెల 29వ తేదీలోగా ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వియ్యంపేట ప్రాజెక్టు పరిధిలో..

కొత్తవలస: వియ్యంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి కొత్తవలస మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ రొంగలి ఉమాదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముమ్మనవానిపాలెంలో అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ), కర్రిచిన్నయ్యపాలెం కేంద్రం హెల్పర్ పోస్టు (ఓసీ) ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులు ఈనెల 29వ తేదీ సాయంత్రం 5 గంటలలో లోపు దరఖాస్తులను మండలంలోని కుమ్మరబంజిరి సమీపంలోని సీడీపీఓ కార్యాలయంలో అందించాలని సూచించారు.

ఎస్.కోట ఐసీడీఎస్ పరిధిలో..

శృంగవరపుకోట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న మూడు అంగన్‌వాడీ హెల్పర్లు, 1 మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు భర్తీకి పీడీపీఓ ఉమ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. జామి మండలంలో అన్నంరాజుపేట, గొడికొమ్ము, ఎస్.కోట మండలంలో సంతగవిరమ్మపేట కేంద్రం -2లో హెల్పర్ పోస్టులను, కురిడి గ్రామంలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టును ఓసీ కేటగిరీలో భర్తీ చేయనున్నట్టు తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం అభ్యర్థులు ఈనెల 29వ తేదీ సాయంత్రం 5గంటలులోగా ఎస్.కోట కార్యాలయానికి నేరుగా, లేదా రిజిస్టర్ పోస్టులో దరఖాస్తులు పంపాలని సూచించారు.

అవకాశాలను సద్వినియోగించుకోండి



పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇస్తున్న ఎస్‌బీఐ (ఆర్‌సేటీ) కో-ఆర్డినేటర్ వర్మ

బొండపల్లి: మహిళలు అన్నిరంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తూ ప్రభుత్వం అవకాశాలు కలిస్తోందని, వీటిని సద్వినియోగించుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కో-ఆర్డినేటర్ వై.వర్మ సూచించారు. పుట్టగొడుగుల పెంపకంపై స్థానిక వెలుగు సమాఖ్య సమావేశ మందిరంలో గ్రామైక్య సంఘాల మహిళలకు కొద్దిరోజులుగా ఇస్తున్న శిక్షణను సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఉత్సాహవంతులైన మహిళలను గుర్తించి వారికి వివిధ రంగాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు కుటీర పరిశ్రమల ఏర్పాటు, వ్యాపారాలు నిర్వహిస్తూ స్వయం ఉపాధి పొందేందుకు బ్యాంకుల నుంచి రుణాలు ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ట్రైనీ చంద్రమోహన్, వెలుగు ఏపీఎం కె.సులోచనాదేవి తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో మెరిసిన గుప్తా



మెరకముడిదాం: మండలంలోని భైరిపురం గ్రామానికి చెందిన సత్యవరపు దినేష్ గుప్తా నీట్ పీజీ ప్రవేశపరీక్షలో జాతీయస్థాయిలో 2,505 ర్యాంకును సాధించాడు. గుప్తాను తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు అభినందించారు.

తోండ్రంగిలో పారిశుద్ధ్య పనులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని తోండ్రంగి గ్రామంలో సర్పంచ్ తోండ్రంగి పిల్ల బంగారులక్ష్మి సోమవారం పారిశుద్ధ్య పనులు చేయించారు. వీధి కాలువల్లో పేరుకుపోయిన పూడిక,చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. పంచాయతీ కార్యదర్శి రఘు పనులను పర్యవేక్షించారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

గంట్యాడ: పిల్లలకు విధిగా పౌష్టికాహారం అందిస్తేనే వారిలో వయస్సుకు తగ్గ ఎత్తు,బరువు పెరుగుదల ఉంటుందని వెలుగు ఏపీఎం పి. శ్రీనివాస్ అన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాల్సిన ఆవశ్యకతపై మండల కేంద్రంలో తల్లులకు సోమవారం అవగాహన కల్పించారు. పిల్లల్లో వయస్సు ఎత్తుకు తగ్గట్లు బరువు లేకపోతే కలిగే అనర్థాలను, రక్తహీనత గురించి వివరించారు. పౌష్టికాహారం లోపం బారిన పిల్లలు పడకుండా పోషకవిలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. పౌష్టికాహార లోపం ఉంటే పిల్లలు తరచూ వ్యాధులు బారిన పడతారని చెప్పారు.

ఈదురు గాలులతో భారీ వర్షం



బొండపల్లి: ముద్దూరులో నెలకొరిగిన మొక్కజొన్న పంటను చూపిస్తున్న రైతు



గజపతినగరం: కాలంరాజుపేటలో మొక్క జొన్న కండెలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీఏ మహరాజన్



గుర్ల: పకీరు కిట్టాలిలో నెలకొరిగిన మొక్కజొన్న పంట

బొండపల్లి: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సోమవారం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో వడగండ్ల వాన కురిసింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు వర్షం వల్ల జాతీయ రహదారి-26పై వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. మండలంలోని పలు గ్రామాల్లో సుమారు 70 ఏకరాల్లో మొక్కజొన్న పంట ఈదురుగాలులకు నెలకొరిగింది. మరి కొద్ది రోజుల్లో పంట చేతికి అందివస్తుందనుకున్న సమయంలో ఇలా జరగడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పంటనష్టాలను పరిశీలించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

120 ఎకరాల్లో నేలకొరిగిన మొక్కజొన్న

గజపతినగరం: మండలంలోని సీతారామపురం, పిడిశీల, కాలంరాజుపేట, తుమికాపల్లి, శ్రీరంగరాజపురం, ముచ్చర్ల, తదితర గ్రామాల్లో సోమవారం ఈదురుగాలులతో కురిసిన వర్షానికి 120 ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కాలంరాజుపేట, తదితర గ్రామాల్లో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను గజపతినగరం డివిజన్ వ్యవసాయశాఖ ఏడీఏ కె.మహరాజన్ పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేస్తున్నామని ఆయన చెప్పారు.

50 హెక్టార్లలో..

గుర్ల: మండలంలో సోమవారం ఈదురుగాలులతో కురిసిన వర్షం మొక్కజొన్న రైతులకు అపార నష్టాన్ని మిగిల్చింది. పకీరుకిట్టాలి, పాలవలస, గూడెం, తాతావారి కిట్టాలి, దేవునికణపాక, కొండగండ్రేడు తదితర గ్రామాల్లో సుమారు 50 హెక్టార్లలో మొక్కజొన్న పంట నెలకొరిగినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు.

ఎం.కొత్తవలసలో 'ఫ్యామిలీ డాక్టర్'



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ సాయి కృష్ణారెడ్డి

గజపతినగరం: మండలంలోని ఎం.కొత్తవలస గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి ఓపీ (అవుట్ పేషెంట్) సేవలందించారు. 69 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం గృహసందర్శన చేసి గర్భిణులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి వైద్యతనిఖీలు నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

కెంగువలో భూసర్వే ప్రారంభం



డ్రోన్‌ను ఎగురవేసి సర్వేను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు,అధికారులు

గజపతినగరం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని కెంగువ గ్రామంలో డ్రోన్ ద్వారా సమగ్ర భూరీసర్వేను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మండల సర్వేయర్ ఎం.భవాని సోమవారం ప్రారంభింబించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూరీసర్వేకు రైతులు అంతా సహకరించాలని కోరారు. ముందుగా డ్రోన్ ద్వారా గ్రామం హద్దులు నిర్ణయించి, తర్వాత భూములను సర్వే చేస్తామని చెప్పారు. సర్పంచ్ కొండల సూరప్పడు, ఎంపీటీసి కొండల సునీత, వైఎస్సార్‌సీపీ నాయకులు లెంక శ్రీనివాసరావు, లెంక గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ మన బాధ్యత



శృంగవరపుకోట: ఎస్.కోటలో ర్యాలీ చేస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు



మెరకముడిదాం: గర్భాంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

శృంగవరపుకోట: బాలల హక్కుల పరిరక్షణ మన బాధ్యతని, బాల్య వివాహాలు నిరోధించడం మన కర్తవ్యమని ఎంఈఓ సత్యనారాయణ అన్నారు. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఆదేశాల మేరకు 'బాలల రక్షణ బాల్యవివాహాల నిర్మూలన 'అనే అంశంపై స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించా రు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు ఎంఈఓ వివరించారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమని, చదువుకోకపోవడం వల్ల, బాల్యవివాహాలు చేసుకోవడం కలిగే నష్టాలపై తల్లిదండ్రులకు అవగాహన లేకుంటే వాళ్లకి వివరంగా చెప్పాలని విద్యార్థులకు సూచించారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

లక్కవరపుకోట: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కంది ధర్మకుమార్ అన్నారు. పాఠశాలలో సోమవారం చైల్డ్ ప్రొటెక్షన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలనకు తమ వంతు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రిన్సిపాల్ ప్రతిజ్ఞ చేయించారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను సైన్స్ ఉపాధ్యాయిని రామలక్ష్మి వివరించారు.



లక్కవరపుకోట : బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

గర్భాంలో ర్యాలీ

మెరకముడిదాం: బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై గర్భాం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు తాడ్డి వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను తక్షణం పరిష్కరించేందుకే 'స్పందన'



గజపతినగరం: వినతులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ పప్పు సుదర్శనం,తహసీల్దార్ అరుణకుమారి



చీపురుపల్లి: అర్జీ స్వీకరిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు అధికారులు

ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమంలో ప్రజలు అందించే అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలని మండల అధికారులకు ఎంపీడీఓలు సూచించారు. మండల పరిషత్ కార్యాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. బొండపల్లిలో ఎంపీడీఓ ఏ.వేదవతి ఆధ్వర్యలో నిర్వహించిన కార్యక్రమంలో. గొల్లుపాలెం గ్రామానికి చెందిన షేక్ గౌరి తనకు రేషను కార్డుమంజూరు చేయాలని, కొత్తపాలెం గ్రామానికి చెందిన వేమలి వెంకటరావు గ్రామ సచివాలయం గేటు నిర్మాణానికి సంబంధించిన బిల్లు మంజూరు చేయాలని వినతిపత్రాలు అందజేశారు.మెరకముడిదాంలో ఉత్తరావల్లి గ్రామానికి చెందిన ది వ్యాంగుడు గురువులు తనకు ట్రైసైకిల్ ఇప్పించాలని ఎంపీడీఓ పి.రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. చీపురుపల్లిలో హౌసింగ్ బిల్లుల చెల్లింపుపై ఎంపీడీఓ కె.రామకృష్ణరాజుకు ఒక అర్జీ అందింది. అనంతరం మండల అధికారులతో ఎంపీడీఓ కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు.దత్తిరాజేరులో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం రెండు అర్జీలు స్వీకరించారు.శృంగవరపుకోటలో తమకు ఉపాధి పనులు కల్పించాలని పలువురు మండల ప్రత్యేకాధికారి సుదర్శన్‌దొరకు వినతిపత్రం అందజేశారు. గజపతినగరంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ పప్పు సుదర్శనం ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనకు ఒక వినతిపత్రం అందజేశారు.



మెరకముడిదాం: ట్రైసైకిల్ కోసం ఎంపీడీఓ రామకృష్ణకు అర్జీ అందజేస్తున్న దివ్యాంగుడు

– గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు, శృంగవరపుకోట, చీపురుపల్లి, మెరకముడిదాం